## పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : శ్రీగణేష్



రెజిమెంటల్ బజార్‌లో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, మే 7 ప్రభాతవార్త: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు నస్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శ్రీగణేష్ ఫౌండేషన్, కేర్ ఆసుపత్రి ముషీరాబాద్, అగర్వాల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రెజిమెంటల్ బజార్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అదే విధంగా కంటి పరీక్షలు చేయించుకున్న వారికికంటి అద్దాలు, అపరేషన్లు కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సన్నీపాల్, సాయి, రజీనా, మారో ్య, శ్రీకాంత్, రోడీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా: క్రిషాంక్




లోహియ నగర్ బస్తీ నిద్రలో ప్రసంగిస్తున్న మన్నె క్రిషాంక్

కంటోన్మెంట్, మే 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసాస్తానని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ మన్నె క్రిషాంక్ తెలిపారు. శనివారం రాత్రి మోండా డివిజన్‌లోని లోహియ నగర్‌లో నిర్వహించిన 7వ బస్తీ నిద్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ లోహియ నగర్‌లో రోడ్లు,డ్రైనేజీ, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు అంగన్ వాడి కేంద్రం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామన్నారు. బస్తీలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన స్పందించిన తన సొంత నిధులతో ఆదివారం బోర్‌వెల్‌ను వేయించారు. అదే విధంగా పంపుసెట్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు ధా ్యనీ, శ్యామ్, మోనీ, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలి

**కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షులు సదాకేశవరెడ్డి**



ఖర్ఖానా ముత్యాలమ్మ ఆలయం వేడుకలకు హాజరైన సదాకేశవరెడ్డిని సత్కరించిన అభిమానులు

బేగంపేట మే 7, ప్రభాతవార్త : ఖర్ఖానా ముత్యాలమ్మ అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదాకేశవరెడ్డి అన్నారు. ఆదివారం అమ్మ వారి ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలలో సదా కేశవరెడ్డి పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్క రించారు.ఈ సందర్భంగా సదాకేశవరెడ్డి మాట్లాడుతూ ముత్యా లమ్మ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలతో పాటు ప్రజ లందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు, తరుణ్, శేషు, మణి,సంతు, అశోక్‌గౌడ్, పాండు భక్తులు పాల్గొన్నారు.

## హిందు ధర్మ పరిరక్షణ కొరకు కృషి



తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులుగా నియమితులైన ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్తకు సన్మానం

గోషామహల్,మే7ప్రభాతవార్త: హిందు ధర్మ పరిరక్షణ కొరకు తన వంతు కృషి చేస్తానని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులుగా నియమితులై భాధ్యతలు స్వీకరించిన ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త అన్నారు.ఆదివారం గో సేవా ఆధ్వర్యంలో లక్ష్మన్‌రావుగుప్త హన్‌మాన్ మందిరం,శ్యామ్‌బాబా దేవాలయంలో ప్రత్యేక పూ జలు చేశారు.ఈసందర్భంగా లక్ష్మన్‌రావు గుప్తను శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రంజనీ శ్రీరామోజ్, ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, సిటి ఉపాధ్యక్షులు నందకిషోర్ అగర్వాల్, సునీల్ అగర్వాల్, కిరణ్, సంగం,రాజారాం,దీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలి

చార్మినార్, మే 7 ప్రభాతవార్త : సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన జరగనున్న నిరుద్యోగ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సభలో నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించనున్నారని ఆయన తెలిపారు.టిపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరగనున్న నిరుదో ్యగ నిరసన సభకు పాతబస్తీలోని అన్ని ప్రాంతాలు నుంచి నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

## మానవసేవే మాధవ సేవగా భావించి వృద్ధులకు సేవలు అందించాలి



నిరుపేద వృద్ధ మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న డి.ప్రసన్న

సైఫాబాద్, మే 7 ప్రభాతవార్త: మానవ సేవే మాధవ సేవగా భావించి నిరుపేద వృద్ధ మహిళల అభ్యున్నతికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకారం అందించాలని కార్ఖానా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రసన్న విజ్ఞప్తి చేశారు. సేవ చేయడం అనేది ఒక అవకాశమని, ఈ భాగ్యం అందరికి లభించదని వచ్చిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని మన:శాంతిని, తృప్తిని పొందాలని కోరారు. అంతర్జాతీయ మదర్స్ డేని పురస్కరిచుకుని శ్రీకర సత్య సహకార సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ నిరుపేద వృద్ధ మహిళలకు ఉచితంగా చీరెలు పంపిణి చేసిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. మానవ జీవితంలో వృద్ధాప్యం చివరి అంకమని ఆదశలో ఉన్న వృద్ధులైన తల్లిదండ్రులను పిల్లలు ప్రేమ, అప్యాయతలతో చూసుకోవాలని వారి సమ స్యలను అవగాహన చేసుకుని పరిష్కారించాలని ఆమె సూచించారు. మహిళల జీవితం ఎంతో గోప్పదని, ఆదర్శవంతమైనదని, మహిళలు లేనిదే సమాజమే లేదన్నారు. నేటి మహిళలు విద్యావంతులుగా ఎదగి తమ కాళ్లపైన నిలబడి జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్ని రంగాలలో పురుషులతోపాటు రాణిస్తున్నారని ఆమె గుర్తు చేశారు. జన్మనిచ్చిన తల్లిని ఎవరు మరువరాదని తల్లికి సేవ అందించడం ఒక అదృష్టంగా భావించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్, ఎస్‌పిఓ నరేష్‌బాబు పాల్గొన్నారు.

## పిల్లలకు విలువలతో కూడిన నాణ్యతమైన విద్యను అందించాలి

అడ్డగుట్ట, మే 7 ప్రభాతవార్త: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు టీచర్లు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీపల్‌ట్రీ ప్రీ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. నర్సరీ, ప్రే స్కూల్‌లో చేర్పించే పిల్లలకు విలువలతో కూడిన నాణ్య తమైన విద్యను అందిస్తే చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తితో వారు విద్యాపరంగా అభివృద్ధి చెంది బావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చిరబోయిన మల్లేశ్ యాదవ్, సంతోష్ యాదవ్, శ్రావణ్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు బత్తుల నారాయణ, దేవులపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఠాకూర్ అమర్‌సింగ్**



లబ్ధిదారునికి చెక్కును అందజేస్తున్న ఠాకూర్ అమర్‌సింగ్

మెహిదీపట్నం, మే 7, ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సం క్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని బిజెపి కార్వాన్ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్వాన్ సబ్జిమండికి చెందిన తన్వీర్ అహ్మద్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార మంజూరైన రూ.30 వేల చెక్కును ఆదివారం గుడిమల్కాపూర్‌లోని పార్టీ కార్యాలయం లో అందజేశారు. ఈ సందర్భంగా ఠాకూర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుం దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల గోవర్ధన్, గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్, మైనార్టీ మోర్చ నాయకులు అహ్మద్‌లు పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించడం మంచి సంప్రదాయం



పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మే 7 ప్రభా తవార్త: గోల్డెన్‌స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం, జనకల వేములవాడ సంయుక్త ఆధ్వర్యం లో కూచిపూడి, భరతనాట్యం, ఒగ్గుకథలు, క్లాసికల్ డ్యాన్సులు, సోషల్ సర్వీస్ రంగాలలో విశేషంగా ప్రతిభ కనబర్చి నందుకుగాను ప్రశం సా పత్రాలు అందించే కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, జానపద బ్రహ్మ, జానపద రత్న డాక్టర్ జవ్వాజి అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా బింగి నరేందర్‌గౌడ్, మల్కాజిగిరి కోర్టు పూర్వ జడ్జ్ బూర్గుల మధుసూదన్, సెంట్రల్ జోన్ అసెంబ్లీ ఏసీపీ రామ్‌దాస్ తేజావత్, నర్సయ్య, ఫిలిం డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు, ప్రైం టీవీసీఈఓ శ్రీనివాస్, భక్తి టీవీ సీఈఓ శ్రీనివాస్, జగిత్యాల ఎస్ఐ పిల్లి రామచంద్రంగౌడ్, కెవి.భక్తవత్సల తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు కెసిఆర్ సమన్యాయం

**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు

సైఫాబాద్, మే 7 ప్రభాతవార్త: తెలం గాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ రాజ్యాంగం ప్రకారం పాలన కొనసా గిస్తు న్నారని, అన్ని వర్గాల ప్రజలకు న మ న్యా య ం అంది స్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వం క్రైస్తవుల కోసం, క్రైస్తవ సమాజం కోసం మెరుగైన జీవనాన్ని అందించడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఆదివారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన వర్‌షిప్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కెసిఆర్ ఉన్నంతవరకు క్రైస్తవులు భయపడవలసిన అవసరం లేదని, వారు స్వేచ్ఛగా జీవించవచ్చునని మంత్రి చెప్పారు. ప్రస్తుతం దేశంలో పరిస్థిలు బాగోలేదని, అన్ని వర్గాల వారు సమానంగా జీవించవలసి ఉందని కాని పరిస్థిలు ఆ విధంగా లేవని విచారం వ్యక్తం చేశారు. యేసుక్రిస్తు ప్రేమ, కరుణ, సేవా, ఆనందంతో జీవించమని మార్గం చూపించారని, క్రిస్తు మార్గంను సమాజం అచరించాలని సూచించారు. క్రిస్టియన్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ అన్ని మతాలను, అన్ని వర్గాలను గౌరవిస్తున్నారని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్ర సచివాలయంలో చర్చి లేదని, కాని తెలంగాణ రాష్ట్రంలోని సచివాల యంలో కెసిఆర్ అనుమతితో చర్చి నిర్మాణం కొనసాగుతున్నదన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ ప్రముఖ గాయకులు పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించి భక్తిగీతాలను అలపించారు.

## బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణ కార్యక్రమం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, హవనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం ఈ ఉత్సవాల్లో భాగంగా భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహ రణం వంటి కార్యక్రమాలు పూర్తయిన అనంతరం 'శేషవాహనసేవ' జరిగింది. కాగా ఆదివారం పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఉత్సాహంగా పాలపిట్ట సైక్లింగ్ రైడ్



జెండా ఊపి సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న ఒంటేరు ప్రతాపరెడ్డి

గచ్చిబౌలి, మే 7 ప్రభాతవార్త : కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైటెక్‌సిటీ నడిబొడ్డున దట్టమైన అడవిని తలపిస్తున్న బొటానికల్ గార్డెన్ సైక్లింగ్ పార్కులో సైకిల్ రైడ్ చేసిన ఔత్సాహికులు వింత అనుభూతిని పొందారు. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టిఎస్ఎఫ్‌డిసి), హైదరా బాద్ సైక్లింగ్ క్లబ్(హెచ్‌బిసి), వరల్డ్ సైక్లింగ్ అలయన్స్‌ల ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో నిర్వహించిన పాలపిట్ట సైక్లింగ్ రైడ్, నైట్ సఫారీ పార్కు సైకిల్ రైడ్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ సైకిల్ రైడ్‌లో వేలాది మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి టిఎస్ఎఫ్‌డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్ గారెన్ విన్ ఓవెన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి సైకిల్ రైడ్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సైకిల్ రైడ్ పాలపిట్ట సైక్లింగ్ పార్కుతో పాటు ఇంకా ప్రారంభించని నైట్ సఫారీ పార్కుల మీదుగా కొనసాగిందని తెలిపారు. ఈ సైక్లింగ్ పార్కులో సైకిల్ రైడ్ చేసే వారు దట్టమైన అడవిలో సైకిల్ తొక్కిన అనుభూతిని పొందుతా రన్నారు. 37 ఎకరాల్లో విస్తరించిన ఆటవీ భూమిలో పచ్చని చెట్లు, చెరువు కట్ట మీదుగా నెమళ్లు, బాతుల సంచారంతో సైకిల్ రైడ్ చేసే వారికి వింత అనుభూతి కలుగుతుందన్నారు. పాలపిట్ట సైక్లింగ్ పార్కులో హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో ఉన్న సైక్లింగ్ పార్కును పునరుద్ధరించిం దని తెలిపారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన పనులను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ సైక్లింగ్ అలయన్స్ మొదటి ఉపాధ్యక్షుడు డివి.మనోహర్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డు కార్మికులకు వేతనాల పెంపు ప్రక్రియను వేగవంతం చేయాలి

**హెచ్‌ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ**




గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: హైదరాబాద్ మెట్రోవాటర్‌బోర్డు లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే జీవో 14, 60 అమలు చేయాలని హెచ్‌ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవోల ద్వారా వేతనాలు అమలు చేయాలని కోరుతూ రూపొందించిని గోడపత్రికను ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయ కుమార్, మారుతి ప్రసాద్, వీరేశం, రమేశ్ తదితరులతో కలిసి ఆవిష్క రించి ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధి లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, జిహెచ్‌ఎంసి కార్మికుల కు జీవోల ద్వారా వేతనాలు పొందుతున్నారని, కాని వాటర్‌బోర్డులో పని చేసే కార్మికులకు మాత్రం జీవో 11 ద్వారా తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల పెంపు ప్రక్రియ పూర్తి అయిన సందర్భంలో వెంటనే వేతనాలు పెంచాలని బోర్డు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కాని వేతనాలు పెంపు ఆలస్యం కావడం వల్ల కార్మికులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కార్మిక పక్షపాతి అయిన సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లపై కార్మికులంతా నమ్మకంతో ఉండాలని కోరారు.

## కళల పుట్టినిల్లు భారతదేశం.. కళల కాణాచి తెలంగాణ

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**




సభలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య, దైవజ్ఞశర్మ, గుజ్జసత్యం, వీరేష్‌యాదవ్, ఏకవీర తదితర అతిథులు

నాంపల్లి, మే 7 ప్రభాతవార్త : కళలకు పుట్టినిల్లు అయిన భారతదేశం అతి ప్రాచీనకాలం నుండి 64 కళలు విరసిల్లుతూ కళాపరిమళాలను వెదజల్లుతూ ప్రపంచవ్యాప్తంగా కళల పుట్టినిల్లు, కళానిలయం, కళల ఆలయంగా పేరొందగా తెలంగాణ రాష్ట్ర కళల కాణాచిగా విరాజిల్లుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీ య బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. అయితే గత కొంతకాలంగా పాశ్చాత్య పోకడలు ఎక్కువై కళలపట్ల యువతకు ఆసక్తి తగ్గుతుండడం శోచనీయమని, కళలను, కళాకారులను అన్నివిధాలా కాపాడవలసిన, ఆదుకోవాల్సిన, ప్రోత్స హించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేట్ స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలపైన కూడా ఉందని ఆయన స్పష్టం చేశారు. డా. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కళలను ఎంతగానో ప్రోత్సహించారని, తెలుగుభాషా, కళల అభ్యున్నతకి ఏకంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్నే నెలకొల్పారని ఈ సందర్భం గా ఆర్.కృష్ణయ్య గుర్తుచేశారు. నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళా మందిరంలో జాతీయస్థాయి సంగీత నృత్య వేడుకలు సంస్థ డైరెక్టర్, ఆర్గనైజర్ ఎం.వీరేష్ యాదవ్, డా. ఎం.ఏకవీరల సారధ్యంలో వైభవోపే తంగా జరిగిన కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, విశిష్ట అతిథులు బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జసత్యం, దైవజ్ఞశర్మ, నాట్యగురువు రాధేశ్యామ్, వెంకట్‌యాదవ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి ఈ సంగీత నృత్యవేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. సంగీత నాట్యకళలలో యోగా ఇమిడి ఉందని, పిల్లలలో మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని చేకూర్చ డమే కాకుండా మేధస్సు, జ్ఞాపకశక్తి, శారీరక, మానసిక ఆరోగ్యం పెరిగి చైతన్యవంతులై విద్యతోపాటు అన్నిరంగాల్లో అద్భుతంగా రాణించి అత్యున్నత స్థాయిలకు చేరుకుంటారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్ననాటి నుండే పిల్లలను కళలవైపు మరల్చి ఆసక్తి, అనురక్తి పెంచాలని కృష్ణయ్య సూచించారు. నేటి సంగీత నృత్యప్రదర్శనల్లో పాల్గొ న్న కళాకా రులను ఆర్.కృష్ణయ్య అతిథుల చేతులమీదుగా ఘనంగా సన్మానించారు.

### గాయనీ సత్యదీప్తికి 'సుస్వర గాన మాధురి' బిరుదు

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: మధురమైన హిందీ తెలుగు పాటలను ప్రతిభావంతులైన గాయనీ గాయకులు ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. ప్రముఖ సంగీత సంస్థ సుబ్బు మ్యూజిక్ అకాడమి అధినేత శ్రీధరం రామసుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు శ్రీధరం హైమావతి రాఘవయ్య జ్ఞాపకార్థం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రామసుబ్ర హ్మణ్యం, సత్యదీప్తితో కలిసి తమిళం, తెలుగు, హిందీ పాటలను ఎంఎస్ఎన్.రావు, కె.శ్రీనివాసరావు, బంధవి, శ్రీకుమార్ నాయర్, స్వప్న, అపర్ణ, రాణిరావు, ఉదయ్ భాస్కర్, శ్రీనివాసన్, కామేశ్వర రావు, కెఇ.రాజు, జెసి.శ్రీనివాస్‌రెడ్డి, రవిబాబు, హరీష్ శర్మ, రామ్ హరీష్, గానం చేశారు. ఈ సందర్భంగా సత్యదీప్తికి 'సుస్వర గానమాధురి' బిరుదును ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ టివి.రావు దంపతులు, అర్చన వేంకటేశ్వరరావు దంపతులు, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ప్రదానం చేసి అభినందించారు.

## గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌యాదవ్




శ్రీనివాస్‌యాదవ్ నియమాక పత్రం అందచేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్)

బేగంబజార్, మే 7 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ బిసిసెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌యాదవ్ నియ మి ం త ు ల య్యా ర ు . బిఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయనకు నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్ (బిలాల్)చేతుల మీదుగా నియమాకపత్రం అందచేశారు.తనపై నమ్మకంతో ఈపదవి అప్పగించిన నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌కు,మంత్రులు కెటిఆర్,శ్రీనివాస్‌యాదవ్,మహమ్మద్‌అలీ, గ్రేటర్ అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్,బిఆర్ఎస్ నాయకులుశైలందర్‌కురమ, పప్పు,శంకర్,అనిత తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో పెరుగుతున్న తలసీమియా రోగుల సంఖ్య

### నేడు ప్రపంచ తలసీమియా దినోత్సవం

చార్మినార్, మే 7 ప్రభాతవార్త : దేశంలో తలసీమియా వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజు,రోజుకు పెరిగి పోతున్నారు..ఒక సారి తలసీమియా వ్యాధి బారిన పడిన రోగులు బ్రతికున్నంత కాలం తప్పని సరిగా డాక్టర్ సలహా మేరకు మందులు వాడవలసి ఉంటుంది.తలసీమియా వ్యాధి రక్తానికి సంబంధించిన ఆవలక్షణం.తలసీమియా వల్ల ఎర్ర రక్త కణాల జీవిత కాలం తగ్గి పోతుంది.పుట్టిన 6 నెలలు నుంచి 18 నెలలలోపు చిన్నారులకు రక్తహీనత,పెరుగుదల బాగలేక పోవటం,కాలేయం ప్లీహం వ్యాకోచించడం వంటి తలసీమియా వ్యాధి ప్రధాన లక్షణాలు తలసీమియా వ్యాధి బారిన పడిన చిన్నారులకు తగిన వైద్య చికిత్సలు సకాలంలో అందక పోతే కొద్ది సంవత్సరాలు తర్వాత మరణిస్తారు. తరచుగా రక్తం ఎక్కించటం,మందులు వాడటంతో పాటు ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులోకి రావటంతో తలసీమియా వల్ల మరణాలు సంఖ్య చాలా వరకు తగ్గాయి.భారత దేశ జనాభాలో 3.5 కోట్ల మంది తలసీమియా క్యారియర్స్ ఉన్నారు.కాగా ఒక అంచనా ప్రకారం భారత దేశంలో ప్రతీ సంవత్సరం 10 నుంచి 12 వేల వరకు తలసీమియా మేజర్ పిల్లలు జన్మిస్తున్నారు. హెచ్‌బి ఎలక్ట్రోఫోరోసిస్ పరీక్ష ద్వారా తలసీమియా లేదా సికిల్ సెల్ వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది.తలసీమియా వ్యాధిగ్రస్థులకు ప్రతీ మూడు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించాలి. తలసీమియా ఉన్న వారికి ప్రోటీన్లు,కేలరీలు అధికంగాను,ఐరన్ తక్కువగా ఉన్న ఆహారం ఇవ్వవలసి ఉంటుంది.జాగ్రత్తగా చూసుకుంటే తలసీమియా సోకిన పిల్లలు అందరి మాదిరిగానే సామాన్య జీవితాన్ని గడుపుతారు.డాక్టర్ ఎ.ఎస్.క్రిష్ణకుమారి ఆధ్వర ్యంలో మొదటి సారిగా 1998లో 20 మంది తలసీమియా రోగులతో తలసీమియా అండ్ సికిల్ సెల్ సోటీని స్థాపించటం జరిగిందని సొసైటి ఉపాధ్యక్షురాలు రత్నావలి తెలిపారు.ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా,శివరాంపల్లి రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలో 3800 మందికి బ్లడ్‌ను అందిస్తున్నామని ఆమె తెలియజేశారు.హైదరాబాద్‌తో పాటు కర్నూల్,ఖమ్మం ప్రాంతాలలో తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలు తలసీమియా రోగులు కోసం పని చేస్తున్నాయని సొసైటీ సంయుక్త కార్యదర్శి అలీంబేగ్ వెల్లడించారు.తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలు నుంచి కూడ రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీకి రోగులు వైద్య పరీక్షలతో పాటు మందులు కోసం వస్తుంటారు.ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన పేద రోగు లకు ఉచితంగా సొసైటీ తరుపున మందులు పంపిణీ చే స్తున్నామని,మే నెల 8వ తేదీన జరగనున్న ప్రపంచ తలసీమియా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అలీంబేగ్ తెలిపారు.

## సంచార జాతుల సమస్యల సాధన కోసం మూడు రోజుల పాటు జాతీయ కన్వెన్షన్

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతుల సమస్యల సాధన, రాజ్యాంగబద్ధమైన హక్కులు, అధికారాలు పొందడానికి విధానాలు తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశ అభిప్రాయపడింది. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, తిపిరిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ డిఎన్‌టి డిక్లరేషన్ రూపకల్పన చేయాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వసతి ఏర్పాటు చేసి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతీయ కన్వెన్షన్ సమావేశంలో నిర్వహించాలని, ఇందుకు దేశ వ్యాప్తంగా ఉన్న సంచార జాతి కులాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, విద్యావంతులు, మేధావులతో కలిసి కులాల సంఖ్య, జనాభా సంఖ్య, జీవన విధాన పరిస్థితులు, సమస్యలు, సాధించు కోవాల్సిన మర్గాలు, అవసరమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధుల పై విధంగా సమస్యలను సేకరించడం జరుగుతుందని, ఫలితంగా దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల సమస్యల సాధనకు మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అన్ని సంచార జాతి కులాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్‌లు పల్లపు సమ్మయ్య, నాగరాజు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు యువరాజ్, కార్యదర్శి నాగేశ్వరరావు, వెంకటేశ్, రవీందర్, భూపతి, జహంగీర్, పాండు, బాబు, రమేశ్, అనిత, సింహాద్రి, సత్యం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి పోరాట స్ఫూర్తితో పనిచేయాలి : వడ్డేపల్లి


అల్లూరి సీతారామరాజుకు నివాళులు అర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

మూసాపేట, మే 7, ప్రభాతవార్త : స్వాతంత్ర సమరయోధుడు, బ్రిటీషర్ల తూటాలను ఎదురించి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి బీజేపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాళులు అర్పించారు. ఆదివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధైర్యానికి, శౌర్యానికి అల్లూరి నిర్వచనంలాంటివారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీజేపి నాయకులు మొవ్వ సత్యనారాయణ, గజ్జల యోగానంద్, కొరడాల నరేష్, కళ్యాణి దుర్గప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సభను విజయవంతం చేయండి

### పిసిసి సభ్యులు డా.సత్యం శ్రీరంగం

మూసాపేట, మే 7, ప్రభాతవార్త : ఇంటికో ఉద్యోగం కెసిఆర్, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని మోదీ, యువత ఆశలతో ఓట్లతో చెలగాటమడారని పిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మతం మద్యం మత్తులలో ముంచి పబ్బం గడుపుకుంటున్నారని, నిరుద్యోగ భృతి ఇస్తామని కెసిఆర్ మాట తప్పారరన్నారు. 3116 చొప్పున ఇప్పటికీ 1,68,264 ప్రతి నిరుద్యోగికి బాకీ ఉన్నారని అన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు, వారిపై అధారపడిన కుటుంబాలకు అందరికి బిఆర్ఎస శోకాలే మిగిల్చిందన్నారు. యువత బాగుంటే దేశం బాగుంటుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తుందని అన్నారు. యువత ఆకాంక్షలు, అమరుల ఆశయాలు నెరవేర్చేందుకు యువ సంఘర్షణ సభకు ప్రియాంక గాంధీ వస్తున్నారని అన్నారు. ఈ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.

## వైభవంగా భవానీ శివసాయి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, మే 7 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం భగవత్ గుడా బుద్వేల్ గ్రామంలోని శ్రీ భవానీ శివసాయి ఆంజనేయ స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మైలార్ దేవ్‌పల్లి డివి జన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం లోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని కోరారు. దేవాలయం కమిటి ప్రతినిధులు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోపాల్, దేవాలయం కమిటి అధ్యక్షులు, రమేష్, మధు, బాల్‌రామ్, రాజు, టి.చిన్నా, పాండుయాదవ్, శ్రీ కాంత్‌రెడ్డితో పాటు శ్రీ భవానీ శివ సాయి ఆంజనేయ స్వామి దేవాలయం కమిటి ప్రతి నిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా నవగ్రహాల ప్రతిష్టాపన


నవగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న మహా లక్ష్మీరామన్ గౌడ్ దంపతులు

హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్ లోని విఠల్‌వాడిలోగల శ్రీవీరాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ పాల్గొని ప్రత్యేంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో బిజెపి రాష్ట్ర నాయకుడు రామన్‌గౌడ్, నగర నాయకులు నర్సింగ్‌గౌడ్, జైస్వాల్, పద్మజా, హితేష్, ఎంవి రావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పర్యాటక శాఖ హిందీ సలహాదారుగా చంద్రదేవ్ కావడే


కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న చంద్రదేవ్ కావడే

సైఫాబాద్, మే 7 ప్రభాతవార్త: కేంద్ర పర్యాటక శాఖ హిందీ సలహాదారుగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడే నియామకం అయినారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం నాడిక్కడ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకరంగా కలిశారు. ఆయన మంత్రి కిషన్‌రెడ్డిని ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి, పరీక్షల కార్యదర్శి ప్రొఫెసర్ సురేష్‌పురి, శృతికాంత్, భారతి, హాజీవల్లి, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రదేవ్ కావడే మాట్లాడుతూ పర్యాటక శాఖలో హిందీ భాషాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

## ఉద్యోగ అవకాశాల పేరిట నకిలీ కాల్‌సెంటర్లతో మోసాలు

హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త : ఉద్యోగ అవకాశాల పేరిట నకిలీ కాల్‌సెంటర్‌తో మోసాలకు పాల్పడిన చక్రధర్‌గౌడ్ లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. బయటకు సామాజిక సేవకుడిగా కనిపిస్తూ అడ్డదారిలో రూ.కోట్లు కూడబెట్టినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్‌ను ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడిన కేసులో నగర టాస్క్‌ఫోర్స్, సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరిన్ని వివరాలు రాబట్టేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. రెండు రోజులుగా నిందితుడి నుంచి కీలక వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. సిద్ధిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ నగరంలో ఓ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశాడు. అనంతరం రాజకీయంగా పేరు పదవులు సంపాదించేందుకు కావాల్సిన డబ్బు కోసం మోసాలను ఎంచుకున్నాడు. 2018లో నకిలీ కాల్‌సెంటర్ ఏర్పాటు చేశాడు. సొంత రాష్ట్రంలో మోసాలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తారనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల యువతను లక్ష్యంగా చేసుకున్నాడు. ప్రముఖ జాబ్ పోర్టల్ నుంచి 10వేల మంది నిరుద్యోగుల వివరాలను రూ.30వేలకు కొనుగోలు చేశాడు. నాలుగేళ్లలో ఎపి, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులకు చెందిన వేలాది మంది యువతీయువకుల వివరాలు సేకరించారు. 45రోజులు వరసగా కాల్‌సెంటర్ ద్వారా రూ.50లక్షలు సంపాదించటమే ఇతడి లక్ష్యం. ఇప్పటివరకూ 11 సార్లు ఇదే తరహాలో మోసం చేశాడని, 40వేల మంది నుంచి రూ.50 కోట్లు కాజేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇందుకు పలు సిమ్‌కార్డులు, 20కు పైగా బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహించాడు. ఈ వ్యవహారంలో 10 పెట్రోల్ బంకుల సహకారం తీసుకున్నట్లు గుర్తించారు. ఈ బంకుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా డేటాను విక్రయించిన వెబ్ పోర్టల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. కొట్టేసిన సొమ్ముతో సిద్ధిపేటలో కుటుంబసభ్యుల పేరిట 10 ఎకరాలు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. బాచుపల్లిలో 5 ప్లాట్లతో పాటు 5 ఖరీదైన కార్లు కొన్నట్లు తెలుస్తోంది. పెద్దమొత్తంలో డబ్బు రాగానే విలాసవంతమైన జీవితం, కాన్వాయ్.. అనుచరులతో హల్‌చల్ చేసేవాడు. రైతులకు సాయం చేసేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేసి మోసాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసినట్లు ఆధారాలు సేకరించారు. పోలీసులు అరెస్ట్ చేస్తారనే సమాచారంతో కీలక ఆధారాలను మాయం చేసినట్లు తెలుస్తోంది.

# ఊపిరాడడం లేదు..!

### నిబంధనలకు నీళ్లొదిలిన పరిశ్రమలు

### కాలుష్యంతోనే సహజీవనం చేస్తున్న ప్రజలు




హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త : నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి వస్తున్న ఘాటైన వాసనలతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రాంతాల్లో 17 అత్యంత కాలుష్యకారక కేటగిరీలకు చెందిన పరిశ్రమలున్నాయి. ముఖ్యంగా జీడిమెట్ల, బాలానగర్ పరిశ్రమల ప్రభావం పరిసర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీటి రసాయన వ్యర్థాలతో సహజనీటి వసతులు అత్యంత కాలుష్యంగా మారుతున్నాయి. భూగర్భ జలాల్లోని నీరు సైతం రంగు మారుతోంది. ఇది అత్యంత ప్రమాదకరమని ఇప్పటికి నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మరోవైపు వాయు కాలుష్యం కూడా పెరుగుతుండటంతో గాలి నాణ్యత తగ్గుతోంది. హైదరాబాద్ మొత్తంలో ఎక్కువ వాయు కాలుష్యం కలిగిన ప్రాంతాలుగా బాలానగర్, జీడిమెట్ల ఉన్నాయి. బాలానగర్‌లో గరిష్ట ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 169గా ఉండగా, జీడిమెట్లలో 148గా ఉంది. ఏక్యూఐ 100 దాటితే శ్వాసకోశ వ్యాధులు, అస్తమా లాంటి సమస్యలూ పెరుగుతాయి. ప్రభుత్వం ఈ పరిశ్రమల పట్ల ఇలాగే వ్యవహరిస్తే కాలుష్యం మరింతగా పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతమైన జీడిమెట్లలో జల, వాయు కాలుష్యం పెరుగుతోంది. ఇక్కడి కాలుష్య కారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలి. వివిధ ప్రభుత్వ సంస్థల అధ్యయన నివేదిక సారాంశమిది. సమస్య తీవ్రత దృష్ట్యా స్పందించిన ప్రభుత్వం వెయ్యికి పైగా ఉన్న అత్యంత కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపలికి తరలిస్తామని జనవరి 2017లో ప్రకటించింది. నాలుగున్నరేళ్ళు దాటుతున్నా ఎక్కడవేసిన గొంగలి అక్కడే ఉంది. మరోవైపు కాలుష్యం మాత్రం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్ నాలుగు విభాగాల్లో వర్గీకరిస్తారు. ఇందులో రెడ్ కేటగిరీ పరిశ్రమలు అత్యంత కాలుష్యకారకం కాగా తర్వాతి స్థానాల్లో ఆరెంజ్ కేటగిరీ ఉంది. ఈ రెండు విభాగాల్లో పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేముందు ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ పరిశ్రమల ద్వారా వెలువడే జల కాలుష్యం ప్రభావం భూగర్భ జలాలపైనా ఉంటుంది. ఇలాంటి పరిశ్రమల్లో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) లాంటి వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్న నిబంధనలున్నాయి. గతంలోనే ఏర్పాటైన ఇలాంటి పరిశ్రమలు సైతం నిర్దిష్ట కాలపరిమితిలోపు జెడ్ఎల్‌డీ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జీడిమెట్ల, బాలానగర్, ఎద్దుమైలారం, బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిధిలోని అత్యంత కాలుష్య కారక పరిశ్రమలు 1545 ఉన్నాయని గతంలో కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. ఇందులో 385 పరిశ్రమలు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపల ఉండగా, 1160 నగరంలోనే ఉన్నాయి. వీటిని ఓఆర్ఆర్ వెలుపలికి తరలిస్తామని జనవరి 2017లోనే ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి కాలుష్య స్థాయి పెరుగుతూనే ఉంటుండగా... తరలింపు ప్రక్రియ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 1160 పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించడంతో పాటు అక్కడ కాలుష్యం వెదజల్లకుండా జెడ్ఎల్‌డీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పరిశ్రమల మంత్రి కెటిఆర్ నాలుగున్నరేళ్ళలో అనేకసార్లు ప్రకటించారు. వీటి తరలింపునకు మెదక్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 19 ప్రాంతాల్లో 3104 ఎకరాలను కూడా గుర్తించారు. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాలుష్య కారక పరిశ్రమల్లో ఎక్కువశాతం ఫార్మా రంగానికి చెందినవే ఉన్నాయి. వీటిని హైదరాబాద్ ఫార్మాసిటీలోకి పంపుతామని ప్రభుత్వం పేర్కొంటున్నా కంపెనీలు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ప్లాంట్‌లోని యంత్రాలను మరోచోటికి మార్చడం ఏమాత్రం వీలుకెఆదని, కొత్త చోటికి మార్చితే యంత్రాలన్నీ కొత్తగా తీసుకోవాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త ప్లాంట్ పెట్టలేమని ఫార్మా కంపెనీలు స్పష్టం చేస్తున్నారు.

జెడ్ఎల్‌డీ వ్యవస్థ ఏర్పాటుచేయని పరిశ్రమలను తరలించాల్సి ఉంటుందని 2017 నుంచే ప్రభుత్వం పేర్కొంటుంది. కొన్ని పరిశ్రమలు అప్పటికే అనుమతులు తీసుకొని ఉండటం, కొన్ని కంపెనీలు గడువు కోవడంతో ఈ వ్యవహారం జాప్యమవుతోంది. 1160లో కాలుష్యం ఎక్కువగా విడుదల చేసే ఫార్మా పరిశ్రమలతో పాటు పొగాకు ఉత్పత్తులు, రసాయనాలు, రబ్బర్, ప్లాస్టిక్, మెటల్ ఫ్రాబ్రికేషన్, లెదర్ లాంటి పరిశ్రమలున్నాయి. నాలుగున్నరేళ్ళ క్రితమే వీటికి ప్రభుత్వం గడువు విధించింది. అది పూర్తయి రెండేళ్ళు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. కనీసం ఉన్నచోట అయినా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు కూడా పరిశ్రమలు సిద్ధంగా లేవు. అయినప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎలాంటి చర్యలు లేవు.

## కర్ణాటకలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎన్నికల ప్రచారం

గోషామహల్, మే 7 ప్రభాతవార్త: కర్ణాటకలో మరోసారి అధికారాన్ని కైవసం చేసుకోవాలని బిజెపి అధిష్టానం జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుంది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారానికి గడువు ఉండగా గోషామహల్ నియోజకవర్గం బహిష్కృత బిజెపి ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆదివారం కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కర్ణాటకలోని సెడం నియో జకవర్గం బిజెపి అభ్యర్థి రాజ్‌కుమార్‌పాటిల్ గెలుపు కోసం రాజాసింగ్ ఎన్నికల ప్రచారం చేశారు. అక్కడ ఎన్నికలప్రచారంలో మాట్లాడుతూ బిజెపికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. దేశ శ్రేయస్సు కొరకు పాటు పడుతున్న దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి అభివృద్దిని చూసి బిజెపికి ఓటు వేయాలని ప్రజలను కోరారు.


కర్ణాటకలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేటి.రాజాసింగ్

## యువతీ యువకులకు ఆట వస్తువులు పంపిణీ


ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

మైలార్‌దేవ్‌పల్లి, మే 7 ప్రభాతవార్త : రాజేంద్ర నగర్ నియోజకవర్గం, అత్తాపూర్ డివిజన్ బిజెపి కార్యాలయంలో ఆదివారం డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ అత్తాపూర్ గ్రామం, పాండు రంగా నగర్, హైదర్‌గూడ, లక్ష్మీనగర్‌తో పాటు పలు బస్తీలకు చెందిన యువతీ యువకులకు, చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ మాట్లాడుతూ ఆటలలో యువత తమ ప్రతిభను కనపరచాలని కోరారు. బిజెపి నాయకులు బిటుకూరి సిద్దేశ్వర్ కడెం, మల్లేష్, వెంకట్‌రెడ్డి, విజయస్వామి, గణేష్, స్టార్ చిన్నరాజుతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు


రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీని సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనిల్ కమార్ కలిసిన్నటి చిత్రం

చార్మినార్, మే 7 ప్రభాతవార్త : రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తారీఖ్ అన్సారీని చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్, మహ్మద్ ఇస్మాయిల్ కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలోను అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన తెలియజేశారు.

## బస్టాప్ నుంచి ఓ విద్యార్థినిని కిడ్నాప్ చేసేందుకు యత్నం.. ఐదుగురిపై కేసు నమోదు

బేగంపేట మే 7, ప్రభాతవార్త : బస్సులో నుంచి దిగిన ఓ విద్యార్థినిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఐదు మందిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట కు చెందిన విద్యార్థిని (19)ఖైరతాబాద్ లోని ఓ కాలేజీలో చదువుకుంటుంది. ప్రతి రోజు లాగానే కళాశాలకు వెళ్లిన విద్యార్థిని శనివారం సాయంత్రం గం6.30ల ప్రాంతంలో ఖైరతాబాద్ బస్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తూ తన స్నేహితురాలితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని ఓ యువకుడు ఈ దృశ్యాన్ని వీడియో తీసాడు. అక్కడి నుంచి ఆ బాలిక 49ఏ నెంబరు బస్సు ఎక్కి బేగంపేట హెచ్‌పీఎస్ ముందు ఉన్న బస్టాప్‌లో దిగబోతుండగా ఆటోలో వచ్చిన ఐదు మంది బస్సు ముందు ఆటోను అడ్డుగా పెట్టి విద్యార్థినిని బలవంతంగా లాక్కొని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇది గమనించి అప్రమత్తమైన బస్సు కండక్టర్, ఇతర ప్రయాణికులు స్థానికులు నిందితులను అడ్డుకుని డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీమా బాసిత్ అహ్మద్(50), సోఫియాతాజ్(40), హలీమా బజబర్(30), మహ్మద్ ఆలీ సోమాలి(23), మహ్మద్ ఫహాద్ ఆలీ(23)లను అదుపులోకి తీసుకున్నారు. బాధిత విద్యార్థిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా

తిరుమలగిరి, మే 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని శ్రీగణేష్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు పరిధిలోని సాయిబాబా హట్స్ బస్తీ వాసుల విన్నపం మేరకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిబాబా హట్స్‌లో పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయిబాబా హట్స్‌లో ప్రధానంగా మంచినీటి సమస్యతో పాటు మరుగుదొడ్లు, డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీలు శ్రీగణేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్తీలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తానని, అదే విధంగా సాయిబాబా హట్స్‌లో ప్రజలునీటి సమస్యతో అల్లాడుతున్నారని, దానికి తన సొంత డబ్బులతో మంచినీటి సింటెక్స్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. కాలనీలో మహిళలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులకు గురౌతున్నారని తన దృష్టికి తేవడంతో పాడైన మరుగుదొడ్ల పునర్ నిర్మాణంతో పాటు మరో కొన్ని మరుగుదొడ్లను నూతన నిర్మాణాలను చేపట్టి అందుబాటులోకి తెస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్యామ్, గురుమూర్తి, రాజు, నాగరాజు, లక్ష్మి, సురేఖ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## నాయిని ఆశయ సాధనకై యువత పాటుపడాలి

### నాయిని నరసింహారెడ్డి మెమోరియల్ క్రికెట్‌లీగ్-2 లో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


క్రికెట్ లీగ్ లో పాల్గొన్న బండారు దత్తాత్రేయ

ధర్నాచౌక్, మే 7, ప్రభాతవార్త: పేదల పక్షపాతి, కార్మిక నేత నాయిని నరసింహారెడ్డి ఆశయాల సాధనకై యువత పాటుపడాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ లీగ్-2 పోటీలకు హాజరై బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, నాంపల్లి కోర్టు జడ్జి సౌజన్య, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఎం.ఎన్.శ్రీనివాసరావులు నాయిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించి, తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నాయిని నరసింహారెడ్డి రాజకీయాలకు అతీతంగా పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. నాయిని నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని యువతను ప్రోత్సహిస్తూ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించటం అభినందనీయమన కొనియాడారు. నిర్వాహకులు వి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండవ రోజు సాయంత్రం కొనసాగిని మ్యాచ్‌లలో 41 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. ఫైనల్ మ్యాచ్ ఈనెల 12 నాయిని నరసింహారెడ్డి జయంతి రోజున జరుగుతుందని, గెలుపొందిన విజేతకు లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతిగా 50 వేల రూపాయల నగదు బహుమతి అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కల్వగోపి, బల్లేకారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు : మంత్రి శ్రీనివాస్‌గౌడ్


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసగౌడ్

ధర్నాచౌక్, మే 7, ప్రభాతవార్త: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని మంత్రి శ్రీనివాసగౌడ్ కొనియాడారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల కోసం ఎనలేని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు అభిమానులు పాల్గొన్నారు.

## మోడీ భావజాలాన్ని యువతకు చేర్చడమే లక్ష్యం

### నమో హైదరాబాద్ ఫౌండర్ ఆజాద్ బాబు



లోగో ఆవిష్కరిస్తున్న ఆజాద్‌బాబు, పద్మావీరప్పనేని, అశోక్‌పట్నాయక్

హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఉన్న యువత దగ్గరికి మోదీ భావజాలాన్ని తీసుకెళ్లడమే లక్ష్యంగా నమో హైదరాబాద్ వేదికను ఏర్పాటు చేశామని ఫౌండర్ ఆజాద్ బాబు అన్నారు. ఈమేరకు ఆదివారం బంజారా హిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో బిజెపి జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మా వీరప్పనేని, కన్వీనర్ అశోక్ పట్నా యక్‌లతో కలిసి నమో హైదరాబాద్ లోగో, వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో యువత పాత్ర ఎక్కువగా ఉంది కాబట్టి దేశాభివృద్ధి కోసం పాలుపంచుకునేలా ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

## తలనొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

సంజీవరెడ్డి నగర్, మే 7, ప్రభాతవార్త : తలనొప్పి భరించలేక ఓ యువకుడ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామం, అనంతపురం జిల్లాకు చెందిన ఎన్.శివప్రసాద్ రెడ్డి (22) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం సంజయ్ గాంధీ, ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న వారి బాబాయ్ ఇంటికి వచ్చారు. గత రెండు సంవత్సరాల నుండి బ్రెయిన్‌లో ప్రాబ్లెమ్ వలన తలనొప్పితో బాధపడుతూ ఉండగా ఒకసారి ఆపరేషన్ కూడా చేయించారు. ప్రస్తుతం మందులు వాడుతున్నారు. సుమారు 5 రోజల క్రితం వారి బాబాయ్, పిన్ని బంధువుల వివాహం నిమిత్తం అనంతపురం వెళ్లగా ఒంటరిగా ఉంటున్నాడు. కాగా శనివారం అర్థరాత్రి తీవ్రంగా తలనొప్పి రావడంతో భరించలేక సూసైడ్ నోట్ రాసి, ఇంట్లో గడియ పెట్టుకొని ఫ్యాన్‌కి ఉరేసుకుని మరణించినట్లు పోలీసులు తెలిపారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : కొంతం దీపిక


బండిమెట్టులో నర్సింహ్మా స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

అడ్డగుట్ట, మే 7 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిస్తే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. బండి మెట్టులో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మి నర్సింహ్మా స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి వారి జయంతి ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొంతం నరేష్, వీరవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికి డబుల్‌బెడ్ ఇల్లు మంజూరు


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మెమెంటోఅందచేస్తున్న బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్, మే7 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారందరికి డబుల్‌బెడ్ రూమ్ మంజూర్ చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ ఇన్‌చార్జ్‌లు సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, జీవన్ సింగ్‌లు మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బొజ్జగుట్టలోని డబుల్‌బెడ్‌రూమ్ నిర్మాణ సమస్యను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మెమెంటోను అందచేశారు. ఈకార్యక్ర మంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాయావతి బహిరంగ సభకు తరలి వెళ్లిన బీఎస్పీ నేతలు

ధర్నాచౌక్, మే 7, ప్రభాతవార్త: ఆదివారం సరూర్‌నగర్‌లో బీఎస్పీ అధ్యక్షురాలు బెహన్ జి కుమారి మయావతి బహిరంగ సభకు ముషీరాబాద్ నుండి బీఎస్పీ నేతలు బైక్ ర్యాలీగా తరలి వెళ్లారు. బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జిల్లా వ్యాప్తంగా కలసి నిర్వహించిన బైక్‌ర్యాలీ లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియం నుండి ప్రారంభమై సరూర్‌నగర్ స్టేడియంకు చేరుకుంది. ఈ ర్యాలీలో సికింద్రాబాద్ ఇన్‌చార్జి పోచగారి నరేందర్, మైనార్టీ నేతలు అబ్రార్ హుస్సేన్, మహ్మద్ షఫీ, ఇతర నేతలు పిల్లా బాలరాజు, విశ్వచారి, నందకుమార్, సత్యనారాయణ, శాంసన్, దినకర్, దొరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

